# బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీహర్ష
- ఘనంగా బాలికా దినోత్సవం

నారాయణపేట టౌన్, జనవరి 24 : బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, సబ్ నేషనల్ చాంపియన్‌షిప్, సబ్ జూనియర్ నేషనల్ స్థాయిలో ప్రతిభ చాటిన బాలికలను సన్మానించి, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటప్ప, స్వప్న, కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు అక్షయ, కావ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సీడీపీవో కార్యాలయం ఆవరణలో బాలికలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నూతనంగా నిర్మించిన సీడీపీవో కార్యాలయం, జిల్లా మహిళా సాధికారిత కేంద్రాన్ని పరిశీలించారు. కార్యాలయానికి సరిపడా ఫర్నీచర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో వేణుగోపాల్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### హక్కులపై అవగాహన..

జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేశ్, డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్, దత్తాత్రేయ, నాగేశ్వరీ, రఘువీర్‌యాదవ్ పాల్గొన్నారు.

### లక్ష్య సాధనకు కృషి చేయాలి

మహబూబ్‌నగర్/మెట్టుగడ్డ, జనవరి 24 : సమాజంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే కష్టపడి చదవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ లీగల్ హెడ్ రఘుపతి, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో..

పాలమూరు, జనవరి 24 : జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధిగమించి ముందుకు సాగాలన్నారు. బాలికల రక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించారు.

### బాల్య వివాహాలు నేరం

బాలానగర్, జనవరి 24 : బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం సెంటర్–1లో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జరీనాబేగం, కమల పాల్గొన్నారు.

### ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు

కృష్ణ, జనవరి 24 : మండల కేంద్రంలోని కస్తూర్బా, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్య, నాటిక ప్రదర్శనలు అలరించాయి. అంగన్‌వాడీల ఆవరణలో బాలికల తల్లిదండ్రులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాజిక వికాసానికి బాలికా విద్య ఎంతో తోడ్పడుతుందన్నారు. ఆడపిల్లలు చదువుతూ ప్రతి ఇంటా వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి

మక్తల్ అర్బన్, జనవరి 24 : మక్తల్ పట్టణంలోని మైనారిటీ గురుకులం విద్యార్థులు బుధవారం ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అమ్మాయిలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను బాలికలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పరిమళదీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, జనవరి 24 : మండల కేంద్రంలోని కేజీబీవీలో మండల సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'దేశాభివృద్ధిలో బాలికల పాత్ర' అనే అంశంపై బాలికలకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, విజయ్‌కుమార్, శివస్వామి, పండరీనాథ్, వేణునాథం తదితరులు పాల్గొన్నారు.

### దామరగిద్దలో..

దామరగిద్ద, జనవరి 24 : మండంలోని కందెన్‌పల్లిలో అంగన్‌వాడీ–2 కేంద్రంలో బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం బాలికలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంజప్ప, ఉపసర్పంచ్ రాములు యాదవ్ పాల్గొన్నారు.

### మాగనూర్‌లో..

మాగనూర్, జనవరి 24 : మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శివరాజ్ మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని బాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీపా, స్వప్న, విశాలాక్షి, శశిరేఖ పాల్గొన్నారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 24 : ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యతోపాటు ఉపాధి కోర్సుల్లో మైనార్టీ గురుకుల విద్యార్థులు రాణించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీ సమీపంలో గల జేపీఎన్‌సీలో మైనార్టీ గురుకుల బాలికల–2 ఒకేషనల్ కళాశాలలో రాష్ట్ర మైనార్టీ గురుకులాల కార్యదర్శి అయోషమస్రత్ ఖానంతో కలిసి కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యను అందిస్తున్నదన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉం టుందని, బాలికలు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. రాష్ట్ర మైనార్టీ గురుకులాల కార్యదర్శి అయోష మస్రత్ ఖానం మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించా రు. విధి నిర్వహణలో ఉపాధ్యాయ, ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీంద్రనాథ్, రాష్ట్ర మైనార్టీ ఒకేషనల్ కళాశాల ఇన్‌చార్జి సుభహాన్, విజిలెన్స్ అధికారులు జమీర్ ఖాన్, అలంఖాన్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జనవరి 24 : పదో తరగతి వార్షిక పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ ప్రేరణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో డీఈవె రవీందర్, ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయభాస్కర్, సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీలు రోజా, ఆంజనేయులు, తాసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీవో జయరాం, హెచ్ఎవ వెంకట్‌జీ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలు సాధించాలి

మరికల్, జనవరి 24 : విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మరికల్, పల్లెగడ్డ గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, మధ్వార్‌లో మహిళా సమఖ్య భవనం, తీలేరులో మన ఊరు–మన బడి నూతన భవనంతోపాటు మూత్రాశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు ఎంతో ముఖ్యమన్నారు.తీలేరు పాఠశాలకు మౌలిక సదుపాలు కల్పిస్తానని, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖారెడ్డి, సర్పంచులు గోవర్ధన్, ఆంజనేయులు, రేవతమ్మ, పుణ్యశీల, ఎంపీటీసీలు సుజాత, గోపాల్, సునీత, ఆంజనేయులు, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కీలకం

రాజాపూర్, జనవరి 24 : గ్రామాల అభివృద్ధికి సర్పంచుల బాధ్యత కీలకమని వైస్ ఎం పీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బచ్చిరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శిని సన్మానించారు. ఐదేండ్ల పాలనలో ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, వార్డు సభ్యులు అచ్చయ్య, రమేశ్, దస్తగిరి, నర్సింహులు, రాజేశ్, తిరుపతయ్య, సత్యయ్య, లింగం, బుగ్గయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అనుమతులను రద్దు చేయాలి

మూసాపేట, జనవరి 24 : మండలంలోని పోల్కంపల్లి గ్రామ వాగు నుంచి ఇసుక తరలింపు అనుమతులను వెంటనే రద్దు చేయాలంటూ బుధ వారం తాసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు గ్రామస్తులు, రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాగులో ఇసుక తరలిం చడం వల్ల వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయని, గతంలో ప్రభుత్వ నిర్మాణాల పేరిట 1000 ట్రిప్పులకు అనుమతిలిచ్చి లెక్కలేనన్ని ట్రిప్పుల ఇసుకను తరలించారన్నారు. వాగులో మిగిలన ఇసుకను తరలిస్తే బోర్లు పూర్తిగా ఎండి పోతాయని ఆన్‌లైన్ ఇసుక తరలింపును వెంటనే నిలిపి వేయాలని కోరారు. అడిషనల్ కలెక్టర్‌కు కూడా వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుయాదవ్, గ్రామస్తులు మండడి రవీందర్ రెడ్డి, నర్సింహులుగౌడ్, సుదర్శన్‌గౌడ్, నర్సింహులు, రైతులు పాల్గొన్నారు.

## మొక్కలు సిద్ధం చేయాలి

బాలానగర్, జనవరి 24 : గ్రామాల్లో హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దాయపల్లిలో నర్సరీ పనులను ఎంపీడీవో కృష్ణారావుతో కలిసి ఆయన పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## అలరించిన సాంస్కృతిక సంబురాలు

జడ్చర్ల టౌన్, జనవరి 24 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండో యూనిట్ శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం రాత్రి కావేరమ్మపేట ప్రాథమిక పాఠశాలలో సాంస్కృతిక సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు పాల్గొని ఎన్ఎస్ఎస్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులపై అవగాహన కల్పించుకొని భారతీయ తత్వమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పీయ చిన్నమ్మ, పాలమూరు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ, ఎన్‌సీసీ అధికారులు సుభాషిణి, కౌన్సిలర్లు జ్యోతి, మహేశ్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల సభ వాయిదా

మూసాపేట(అడ్డాకుల), జనవరి 24 : గత డిసెంబర్ 27వ తేదీన జరగాల్సిన మండల సభ కోరం లేకపోవడంతో వాయిదా పడింది. తిరగి బుధవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినా ఎంపీపీ దోనూరు నాగార్జునరెడ్డి విదేశాలకు వెళ్లడంతో వైస్ ఎంపీపీ రాచాల రాధిక అధ్యక్షతన నిర్వహించాలని ఏర్పాట్లు చేశారు. కానీ వైస్ ఎంపీపీ కూడా హాజరు కాలేదు. దీంతో ఎంపీడీవో మంజుల సీనియర్ ఎంపీటీసీ సభ్యుడు రంగన్నగౌడ్ అధ్యక్షతన సమావేశం ప్రారంభించారు. అందుకు సభ్యు లు కోరం లేకుండా ఎలా నిర్వహిస్తారని, ఈ నెల 30కి వాయిదా వేయాలని కోరడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. కార్యక్రమం లో సింగిల్‌విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, సభ్యులు రంగన్నగౌడ్, గణేశ్, శకుంతల, అని త, శామలమ్మ, సర్పంచులు జయన్నగౌడ్, శ్రీకాంత్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మక్తల్ టౌన్, జనవరి 24 : మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల విద్యాలయ సంస్థలో 6 ,7, 8వ తరగతిలో 2024–2025 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి వచ్చే నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలనిబీసీ వెల్ఫేర్ కన్వీనర్ సుగుణశ్రీ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్నికల నియమావళి పాటించాలి

మక్తల్ టౌన్, జనవరి 24 : త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ పార్టీల నాయకులు నడుచుకోవాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు లిస్టుపై రా జకీయ పార్టీ నాయకులకు బుధవారం మక్తల్ తాసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## డబుల్ బెడ్రూం ఇండ్ల పరిశీలన

రాజాపూర్, జనవరి 24 : మండలంలోని చొక్కంపేటలో కేసీఆర్ సర్కారు హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను బుధవారం అదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశీలించారు. ఇండ్లకు తాళాలు వేయించి, త్వరలోనే అర్హులైన వారికి ఇండ్లు ఇస్తామని తెలిపారు.

## సురక్షిత ప్రయాణానికి డ్రైవర్లే ముఖ్యం

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 24 : డ్రైవర్లు అంకితభావంతో పనిచేస్తూ ఆర్టీసీ సంస్థ ఆదాయం పెంచేందుకు, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం డ్రైవర్స్ డే సందర్భంగా ఆర్ఎం డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ఎంతో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణం చేస్తున్నారని గుర్తుచేశారు. దేశంలోనే ఆర్టీసీకి ప్రత్యేక గుర్తింపు ఉందంటే అది డ్రైవర్ల కృషి ఎంతో ఉందన్నారు.

## రక్తహీనతను రూపుమాపాలి


నారాయణపేట టౌన్, జనవరి 24 : రక్తహీనత లేని సమాజాన్ని నిర్మించాలని డీఐవో శైలజ అన్నారు. బుధవారం ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమాన్ని ఆమె పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 5 ఆర్‌బీఎస్‌కే బృందాలు పని చేస్తున్నాయన్నారు. అవసరమైన విద్యార్థులను జిల్లా దవాఖానకు రిఫర్ చేస్తామన్నారు.

## విద్యార్థినులకు రక్తపరీక్షలు

జడ్చర్ల టౌన్, జనవరి 24 : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం జడ్చర్లలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు.

## కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జడ్చర్ల టౌన్, జనవరి 24 : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 23వ తేది వరకు జిల్లా కేంద్రంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు విజయం సాధించి ప్రథమ బహుమతి సాధించినట్లు జడ్చర్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పీయ చిన్నమ్మ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



ధర్నా చేస్తున్న డీబీఎస్‌యూ, కేవీపీఎస్ నాయకులు

## యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

నారాయణపేట, జనవరి 24 : కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో మాదకద్రవ్యాల నిషేధంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు సరఫరాకు సంబంధించి మక్తల్, మద్దూర్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని, మళ్లీ కేసులు నమోదు కాకుండా రెవెన్యూ, ఎక్సైజ్, వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి గంజాయి సాగును నిరోధించాలన్నారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఐఈవో రియాజ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

### పనుల్లో వేగం పెంచాలి..

కోస్గి, మద్దూర్ మండలాల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. కోస్గి, మద్దూర్ మండలాల్లో పర్యటించి నివేదికలు ఇవ్వాలన్నారు.

## ఎయిర్‌ఫోర్స్‌పై అవగాహన సదస్సు


ఎయిర్‌వింగ్ కమాండింగ్ గురుప్రీత్ హత్వాల్

పాలమూరు, జనవరి 24 : జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిర్‌ఫోర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎయిర్‌వింగ్ కమాండింగ్ గురుప్రీత్ హత్వాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం గగనతలంలో దేశరక్షణ కోసం ఇండియన్ ఎయిర్‌వింగ్ ఫోర్స్ పనిచేస్తుందన్నారు. కేవలం ఇంటర్మీడియట్ అర్హతతో కొలువు సాధించవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్లపాటు విధులు నిర్వహించే అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ఎన్‌సీసీ విద్యార్థుకు ఏడు మార్కులు అదనంగా కలుస్తాయని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్, ఎన్‌సీసీ అధికారులు గురురాఘవేంద్రారెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

మూసాపేట (అడ్డాకుల), జనవరి 24 : సింగిల్‌విండో ద్వారా తీసుకున్న రుణాలు వెంటనే చెల్లించాలని కొత్తకోట డీసీసీబీ మేనేజర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం అడ్డాకుల సింగిల్‌విండో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సింగిల్‌విండో ద్వారా తీసుకున్న వ్యవసాయ, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకుంటే వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ 7 శాతం కట్టడంతో పాటు ప్రభుత్వం అందించే సబ్సిడీ వర్తిస్తుందన్నారు. లేదంటే 14 శాతం వడ్డీ, చక్రవడ్డీలతో కట్టాల్సి వస్తుందని చెప్పారు. కాగా ప్ర భుత్వం పంట రుణాలను మాఫీ చేస్తుందని చెప్పినందున రైతులు ఎదురు చుస్తున్నారని, ఏ తేది వరకు రుణమాఫీ కటాఫ్ ప్రకటిస్తున్నారని మేనేజర్‌ను విలేకరులు ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. కార్యక్రమంలో కొత్తకోట డీసీసీబీ సూపర్‌వైజర్ కే.విజయ్‌కుమార్‌రెడ్డి, సీఈవో వెంకటయ్యగౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానం కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజాపూర్, జనవరి 24 : నవాబుపేట మండలంలోని ఇప్పటూర్‌కు చెందిన దళితుల శ్మశానవాటికను కబ్జాచేసిన వారిపై కేసు నమోదు చేయాలని డీబీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు అనంద్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురుమయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దీప్లానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఇప్పటూర్ గ్రామ దళితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు మూడు తరాలుగా వాగు శివారులో బొందలు పెడుతున్నారని, రాజాపూర్ కాంగ్రెస్ మండల నాయకుడు శ్మశానాన్ని ధ్వంసం చేశారన్నారు. ఈ ఘటనపై నెల రోజుల కిందటే రాజాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయకుండా దళితులపైనే కౌంటర్ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. నవాబుపేట తాసీల్దార్ కార్యాలయం అధికారులు నదివాహక భూమి అని చెప్పి, నేడు పట్టాభూమిగా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఆర్డీవో, డీఎస్పీ గ్రామాన్ని సందర్శించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా దళితుల శ్మశానవాటికను ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడంతోపాటు దళితులపై పెట్టిన అక్రమ కౌంటర్ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 24 : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం మహాగొప్ప దానమని జిల్లా జడ్జి పాపిరెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు ఆవరణలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పాలమూరు జిల్లా కోర్టు న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. జిల్లా అదనపు జడ్జి పద్మ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మొత్తం 62మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కోర్టు జడ్జి హరికుమార్, జిల్లా అదనపు కోర్టు జడ్జీలు సూర్య చంద్రకళ, పద్మ, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలనాథ స్వామి కల్యాణం

బాలానగర్, జనవరి 24 : మండలంలోని పెద్దరేవల్లిలో తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణాన్ని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, యాదయ్యగౌడ్, దత్తాత్రేయ, శశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబ్‌నగర్, జనవరి 24 :పట్టణంలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఉదయం 6నుంచి 10గంటల వరకు న్యూటౌన్, స్టేడియం మైదానం, రాజేంద్రనగర్ తోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ ఆదిత్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ప్రధాన రోడ్డు మార్గంలో విద్యుత్ మరమ్మతు కారణంగా ఉదయం 6:30గంటల నుంచి 7:30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బాధితుడికి ఫోన్ అందజేత

దేవరకద్ర, జనవరి 24: పట్టణానికి చెందిన గోపిరాజు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా తన సెల్ ఫోన్ పోయింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించి బుధవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

## సభ్యత్వం తీసుకోవాలి

మూసాపేట(అడ్డాకుల), జనవరి 24 : రైతులు సింగిల్ విండో సభ్యత్వాలు తీసుకోవాలని అడ్డాకుల సింగిల్‌విండో చైర్మన్ మద్దూరి జితేందర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ పట్టాదార్ పాస్‌బుక్ ఉన్న రైతులు సభ్యత్వం తీసుకోవడానికి రూ.550 నగదుతో పాటు, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు, రెండు పాస్ ఫొటో సైజ్ ఫొటోలు తీసుకోని సింగిల్ విండోకు వస్తే సభ్యత్వం ఇస్తారని తెలిపారు. సభ్యత్వం పొందిన రైతులకు రుణాలతో పాటు, ఎరువులు, విత్తనాలు కూడా సరఫరా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## గోషాలకు ఆవుల తరలింపు

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట) జనవరి 24: చిన్న చింతకుంట మండలం కురుమూర్తి స్వామికి భక్తులు కానుకల రూపంలో అందజేసిన ఐదు గోవులను బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు హన్వాడ మండలం చిన్నదర్పల్లి శ్రీలక్ష్మి గోషాలకు తరలించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఆలయ సిబ్బం ది, గోకాపరులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలిండియా సౌత్‌జోన్ పోటీలకు పీయూ విద్యార్థులు

పాలమూరు, జనవరి 24 : పాలమూరు విశ్వవిద్యాలయం విద్యార్థులు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ/ఆలిండియా చెస్ పోటీలకు బయలుదేరి వెళ్లినట్లు పీయూ పీడీ శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తమిళనాడులోని భారతీదాసన్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ట్రాక్‌సూట్, యూనిఫామ్స్ అందజేసి పోటీల్లో ప్రతిభ చాటాలని సూచించారు.

## కారు బోల్తాపడి వ్యక్తి మృతి

కృష్ణ, జనవరి 24: కారు అదుపుతప్పి బోల్తా పడగా ఒకరు మృతి చెందిన ఘటన తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం మేరకు మండలంలోని చేగుంట వద్ద ఉన్న విశ్వదాబా ఓనర్ రమేశ్ మంగళవారం అర్ధరాత్రి కారులో సైదాపూర్ వైపు వెళ్తుండగా బార్డర్ చెక్‌పోస్టు వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## కారు, బైక్ ఢీ : నలుగురికి గాయాలు

మిడ్జిల్, జనవరి 24 : రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన మల్లేశ్ తన భార్యను మిడ్జిల్ నుంచి తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. మిడ్జిల్ మండ లా నికి చెందిన దోనూర్ ఎంపీటీసీ భర్త రమేశ్‌నాయక్ మార్గమధ్యలో మల్లేశ్‌ను లిఫ్ట్ అడుగడంతో ఎక్కించుకున్నాడు. పెద్దగుండ్లతండా వద్ద కారు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో మల్లేశ్, రమేశ్‌నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కారులో డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురు మహిళలు ఉండగా, డ్రైవర్‌తోపాటు ఒక మహిళకు గాయాలయ్యాయి. ఇందులో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

## వృద్ధురాలు అదృశ్యం : కేసు నమోదు

నవాబ్‌పేట, జనవరి 24 : మండలంలోని మల్లారెడ్డిపల్లికి చెందిన కొత్త పద్మమ్మ(60) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఏఎస్సై ఆనంద్ తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. కొత్త పద్మమ్మ ఈనెల 7వ తేదీన మల్లారెడ్డిపల్లిలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. అప్పటి నుంచి వారి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. పద్మమ్మ కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

నారాయణపేట రూరల్, జనవరి 24 : మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో బుధవారం అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అప్పిరెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులు తండ్రి హన్మంతు ఇంట్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి 5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.